ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 14 ఏప్రిల్ 2025 | 5





మారేడుమిల్లిలో రోడ్డుపై కూలిన చెట్టు



రాజమహేంద్రవరంలో మెరుపులు



పిఠాపురంలో భారీ వర్షం.. యు.కొత్తపల్లి మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం



ఈదురుగాలుల బీభత్సం

- 'ఉమ్మడి తూర్పు'లో భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు
- తెగిపడిన విద్యుత్ తీగలు
- గ్రామాల్లో అంధకారం
- తడిచిపోయిన ధాన్యం

కాకినాడ/పిఠాపురం/గొల్లప్రోలు/కొత్తపల్లి/ రాజమహేంద్రవరం సిటీ- ఆంధ్రజ్యోతి): జిల్లాలో గాలి వాన బీభత్సం సృష్టించింది. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రికి పెనుగాలులు వీచాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కరెంటు స్తంభాలు సైతం కూలిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో అంధకారం అలుముకుంది. గాలుల తాకిడికి రహదారులపై ఇసుక, దుమ్ము సైతం లేచింది. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల తోపాటు ఏజెన్సీ ప్రాంతంలో కూడా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాత్రి 9 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. హోరుగాలితో జనం హడలెత్తిపోయారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కొత్తపల్లి, ప్రత్తిపాడు మండలాల్లోను, కోనసీమ జిల్లాలోని అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, కె.గంగవరం తదితర చోట్ల, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోను భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి విద్యుత్‌స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. తోటల్లో మామిడికాయలు నేలరాలిపోయాయి. ధాన్యం రాశులు తడిచిపోయాయి. నువ్వులు, అపరాలు, ఇతర మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. కాకినాడ మెయిన్‌రోడ్డులోను ఓ భారీ వృక్షం నేలకూలింది. రామారావుపేట పాము వారి వీధిలో కరెంటు తీగలపై చెట్టు పడింది. గొల్లప్రోలు-తాటిపర్తి, గొల్లప్రోలు-చెందుర్తి ఆర్‌అండ్‌బీ రోడ్లతోపాటు పలు ప్రధాన రహదారులపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలు నిలిపివేశారు. 50 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు కొత్తపల్లి మండలం ఉప్పాడలో కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఊరిలోనే.. ఉపాధి!

- యువతకు వర్క్‌ఫ్రం హోం
- కూటమి ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్
- సాఫ్ట్‌వేర్‌పైనే ప్రధాన దృష్టి
- ఇంట్లోనే పనిచేసుకునేలా సౌకర్యాల కల్పన
- లేదంటే వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లొచ్చు
- ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు
- ఇప్పటికే పూర్తయిన సర్వే
- పని ఉన్నవారు వేలల్లో.. లేనివారు లక్షల్లో
- సర్వేలో విద్యార్హతలతో సహా తేలిన లెక్కలు
- ఇంటర్‌నెట్ కనెక్షన్ల వివరాలూ నిక్షిప్తం



సొంత ఊరిలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉద్యోగులకు, కంపెనీలకు ఉపయోగపడేలా ఇంటి నుంచే పని (వర్క్‌ఫ్రం హోం) సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తోంది. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం విధానం సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన కార్పొరేట్ సంస్థల్లో కొనసాగుతోంది. కొవిడ్-19 తర్వాత చాలా కంపెనీలు దీనిని కొనసాగిస్తున్నాయి. కంపెనీలకు ఈ విధానం సులభంగా ఉండడం, ఆర్థికంగా మేలు జరుగుతుండడంతో పనులు చేయించుకునేందుకు ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయి. తద్వారా ఎక్కువమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అనుగుణంగా వర్క్‌ఫ్రం హోంకు అనువైన కేంద్రాలను గుర్తించే పనులు చేపడుతున్నారు.

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం -ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలోనే యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తున్నాయి. అది కూడా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాలతోపాటు, విదేశాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. చాలామంది అక్కడి వెళ్లిపోతున్నా.. కొంతమంది మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లో పనిచేసినా వచ్చే జీతంలో ఎక్కువ ఖర్చులకే అయిపోవడం, తల్లిదండ్రులు, కుటుంబాలకు దూరంగా ఉండాల్సి రావడంతో సొంతూరిలోనే ఏదొక వ్యాపారం, వ్యవసాయం, తమ చదువులకు తగ్గ చిన్న ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఇంటి వద్దే ఉంటూ ఐటీ కంపెనీల్లో పనిచేయడానికి వీలున్న యువతను గుర్తించే పనులు చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో యువతీయువకులు, అర్హతలు వంటివి సర్వే ద్వారా సేకరించారు.

అందరివీ 'ఐటీ' కలలే..

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఏ విభాగంలో విద్యను అభ్యసించారో కూడా వివరాలు సేకరించారు. అయితే ఈ సర్వేని బట్టి దాదాపుగా అందరూ సాఫ్ట్‌వేర్‌కే ప్రాధాన్యం ఎక్కువ ఇస్తున్నారు. దీంతో తొలుతగా ఆ రంగంలోనే ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా సాఫ్ట్‌వేర్ అభ్యసించిన వాళ్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయారు. కానీ ఐటీ రంగంలో ఆ స్థాయిలో ఉద్యోగ కల్పన లేదు. ఒకవేళ ఉన్నా సుదూర ప్రాంతాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐటీ సెక్టార్‌ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మరింత దుస్థితికి దారితీసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత సాఫ్ట్‌వేర్ చదువుకున్న అభ్యర్థుల కష్టాలను గుర్తించింది. కొందరికి వర్క్‌ఫ్రంహోం సదుపాయాన్ని కంపెనీ కల్పించినా ఇంటి వద్ద సరైన సౌకర్యాలు లేవు. అధిక శాతం మందికి అసలు ఉద్యోగాలే లేవు. స్వల్ప సంఖ్యాకులకు ఉద్యోగం ఉన్నా దూర ప్రాంతాల్లో అతి తక్కువ జీతాలతో నెట్టుకు రావాల్సి వస్తోంది. దూర ప్రాంతాల్లో ఇబ్బందులు పడలేక ఉద్యోగం వదిలేసి సొంతూరికి వచ్చి ఏదొక పని చేసుకుంటున్నవాళ్లూ ఉన్నారు. ఈ సమస్యలకు వర్క్‌ఫ్రం హోంతో చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ చదువరులకు వర్క్‌ఫ్రం హోం కష్టాలు తగ్గించడం, వారికి ఉద్యోగం లేకపోతే ఏదొక కంపెనీ తరపున వర్క్‌ఫ్రం హోం సదుపాయం కల్పించడంపై కసరత్తు జరుగుతోంది. ఒక మండలంలో వివరాల ప్రకారం ఆయా ప్రదేశాల్లో ఒకచోట వర్క్‌ఫ్రం హోంకి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తారు. అక్కడ కంప్యూటర్లు, వైఫై వంటి సదుపాయాలు ఉంటాయి. ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం సెంటర్‌కి వెళ్లి విధులు నిర్వహించుకోవచ్చు.



ఇవీ సర్వే గణాంకాలు

విద్యార్హతలు	తూర్పుగోదావరి	కాకినాడ	కోనసీమ
నిరక్షరాస్యులు	5,095	6,940	3,278
తొమ్మిదిలోపు చదువు	22,202	25,795	23,375
పదో తరగతి	32,791	38,581	39,142
ఇంటర్	36,428	47,094	45,168
డిప్లమో/ఇతరం	9,265	12,923	13,982
ఇంజనీరింగ్	18,600	22,606	23,863
కామర్స్ డిగ్రీ	8,966	9,550	9,663
ఆర్ట్స్ డిగ్రీ	8,718	10,787	10,193
డిగ్రీ ఇతర కోర్సులు	30,282	42,131	37,508
ఎంబీబీఎస్	247	302	239
బీఎల్	218	256	184
పీజీ	11,538	12,924	12,535
పీహెచ్‌డీ	194	227	258
ఇతరులు	4,944	5,991	7,311
ఉద్యోగం/ఉపాధి :			
పనిచేస్తున్నవారు	27,962	30,795	27,337
పనిచేయనివారు	1,61,493	2,05,345	2,01,573
మొత్తం :	1,89,455	2,36,140	2,28,910
బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ :			
ఉన్నవారు :	20,993	20,163	18,873
వైఫై ఫెసిలిటీ	11,511	15,034	12,153
అదనపు వైఫై సౌకర్యం	48,737	61,516	49,452

వర్క్‌ఫ్రం హోం సర్వే లక్ష్యం ఇదే

వర్క్‌ఫ్రం హోం ద్వారా పనిచేసేందుకు ముందుకు వచ్చే నిరుద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి కూటమి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంటర్నెట్, ఏసీ సదుపాయం ఉన్న భవనాలను గుర్తించే పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు? ఉద్యోగాలు చేస్తున్నవారు ఏయే కంపెనీల్లో చేస్తున్నారు?, ఇంటి దగ్గరే ఉండి పనిచేస్తున్నారా?, ఆయా కంపెనీలకు వెళ్లి పనిచేస్తున్నారా? వర్క్‌ఫ్రం చేసేవారు ఎక్కడి నుంచి చేస్తున్నారు?, వారు పనిచేసే రూమ్ సైజ్ ఎంత?, ఆ రూమ్‌లో వేరొకరికి చోటు కల్పించే అవకాశం ఉందా?, ఇంటర్నెట్ సౌకర్యం ఉందా?, ఎంత స్పీడ్‌లో నెట్‌ను వినియోగిస్తున్నారు? వంటి వివరాలపై సర్వే నిర్వహించారు. అలాగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు విద్యార్హతలు ఉన్న వారెందరు? ఉద్యోగాలు చేస్తున్నారా? లేదా? చేయకపోతే కారణాలు?, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఎంతమందికి ఆసక్తి ఉంది? ఇలా వివరాలు సేకరించారు. వీరందరూ త్వరలోనే ఇంటి నుంచి పనిచేసుకునేలా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఎక్కడెక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా ఇంటిపట్టునే ఉంటే.. ఉద్యోగం చేసుకునేలా ఉపాధి చూపనుంది. ఇప్పటికే ఆయా సంస్థల ప్రతినిధులతో కూటమి సర్కారు పెద్దలు సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' రద్దు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినందున ఈ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి భూముల క్రమబద్ధీకరణ పథకం

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ చట్టాలు, నిబంధనల్లో సమూల మార్పులు తీసుకురావాలని భావించి భూముల క్రమబద్ధీకరణ పథకం-2025ను ప్రవేశపెట్టినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. భూముల క్రమబద్ధీకరణ చట్టం నిరుపేదల భూములకు వరంగా మారిందన్నారు. సామాన్యులు ఎదుర్కొంటున్న అసైన్డ్ భూముల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రెవెన్యూ చట్టాలు, నియమ నిబంధనల్లో మార్పులు తీసుకువచ్చి సవరణలు చేయడం ద్వారా రెవెన్యూ వ్యవస్థను మరింత సులభతరం చేయనున్నారన్నారు. వ్యవసాయభూమి వినియోగ మార్పిడి తదితర పథకాలను మరింత బలోపేతం చేస్తూ అసైన్డ్ భూముల చట్టం ప్రకారం భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో పేదల ప్రయోజనాలను కాపాడే కొత్త పాలసీని ఖరారు చేసిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరంలేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తారన్నారు. 2019 అక్టోబరు 15వ తేదీని ప్రభుత్వం కటాఫ్ తేదీగా నిర్ణయించిందని, ఆ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. మాస్టర్ ప్లాన్ జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలతోపాటు కాల్వలు, నదీ ప్రవాహగట్లు తదితర స్థలాలకు ఈ ఉత్తర్వులు వర్తించవన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుంది. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుపైనే జారీ చేస్తామన్నారు. ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి గతంలో జారీచేసిన ఉత్తర్వులన్నింటినీ పక్కన పెడుతూ జీవో నంబరు 30ను జారీ చేసిందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31లోగా క్రమబద్ధీకరణకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందించాలన్నారు. గడువులోపు దరఖాస్తులు దాఖలు చేయనివారి ఆక్రమణలు తొలగించేందుకు తహశీల్దార్లు చర్యలు తీసుకుంటారని జేసీ నిషాంతి స్పష్టంచేశారు.

పేలుడు విషాదం!

- ఉలిక్కిపడిన సామర్లకోట
- అనకాపల్లి జిల్లాలో బాణసంచా ప్రమాదం
- మృతుల్లో ఒకరు సామర్లకోట మండలం వేట్లపాలెం వాసి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



బాణసంచా ప్రమాదంలో మరణించిన నిర్మల (కింద) ఫైల్‌ఫొటో

సామర్లకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో ఆదివారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో ఎనిమిది మంది మృతి చెందిన ఘటన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఒక మహిళ ఈ ఘటనలో మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో ఈ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. క్షతగాత్రులు ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం ఆందోళన కలిగించింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలి పని కోసం సామర్లకోట మండలం వేట్లపాలెంలోని గూడపర్తికి చెందిన గొడత నిర్మల(38) అనే మహిళ కొన్నాళ్ల కిందట వెళ్లింది. బాణసంచా పేలుడు ఘటనలో ఆమె మృతి చెందిందన్న సమాచారంతో ఇక్కడ వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట ప్రాంతాల్లో బాణసంచా తయారీలో ఉన్న వారంతా ఉలిక్కిపడ్డారు. నిర్మల కొంతకాలం కిందట గూడపర్తి గ్రామం నుంచి మరికొందరితో కలిసి బిక్కవోలు సమీపాన కొమరిపాలెంలో బాణసంచా తయారీ పనుల నిమిత్తం అక్కడకు వెళ్లిపోయింది. అక్కడి నుంచి మరికొందరి కూలీలతో కలిసి అనకాపల్లి సమీపాన కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణసంచా తయారీ సంస్థల్లో కూలీ పనుల నిమిత్తం వెళ్లి చాలా కాలమైనట్టు వేట్లపాలేనికి చెందిన పలువురు సహచర కుటుంబీకులు తెలిపారు. నిర్మల స్వతహాగా శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మహిళ కాగా, కొన్నేళ్లుగా ఆమె వేట్లపాలెం గ్రామానికి చెందిన బుజ్జి అనే వ్యక్తితో కలిసి ఉంటున్నట్టు సమాచారం. అలాగే సామర్లకోట పెన్షన్‌లైన్‌కు చెందిన మరికొందరు వ్యక్తులు కూడా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కూలీ పనుల నిమిత్తం వెళ్లినట్టు సమాచారం. వీరిలో మరో ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వారున్నట్టు సమాచారం రావడంతో వారి శాశ్వత చిరునామాల కోసం రెవెన్యూ సిబ్బంది ఆరా తీశారు. ఇదే ఘటనలో సామర్లకోట పట్టణం పెన్షన్‌లైన్‌కు చెందిన వేళంగి రాజు, భార్య వేళంగి సంతోష్, వేళంగి షరోణి తీవ్ర గాయాలతో విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామర్లకోటకు చెందిన సత్తిబాబు అనే వ్యక్తి ద్వారా సమాచారం అందింది. ఈ ఘటనతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బాణసంచా తయారీ సంస్థలన్నీ అప్రమత్తం అయ్యాయి. గత దీపావళి ముందురోజు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంతోపాటు అమలాపురం, అంతకు ముందు సామర్లకోటలోనూ బాణసంచా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి.

మట్టల ఆదివారం.. ప్రత్యేక ప్రార్థనలు

మట్టల ఆదివారం సందర్భంగా జిల్లాలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణాలు, గ్రామాల్లో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం శాంతి ర్యాలీలు నిర్వహించారు. మతపెద్దలు పాల్గొని క్రైస్తవులను నడిపించారు.

లోపలి పేజీల్లో..



మట్టల ఆదివారం సందర్భంగా కె.గంగవరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోకో గింజలకు నాణ్యమైన ధరను అందించాలి

- అంబాజీపేటలో కోకో రైతుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి

అంబాజీపేట,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోకో సాగు చేసే రైతులనుంచి గింజలను నాణ్యమైన ధరలకు అందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోకో సాగు రైతులు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయంలో జిల్లాస్థాయి కోకో సాగు రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కోకో సాగు రైతుల సంఘం సంయుక్త కార్యదర్శి కొప్పిశెట్టి ఆనందప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోకో రైతులు మాట్లాడుతూ కోకో సాగు చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నప్పటికీ రైతుల వద్ద కోకో గింజలను సరైన ధరకు కొనుగోలు చేయడం లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం కోకో గింజల ధర కిలో రూ.750 ఉండగా ప్రస్తుతం రైతుల నుంచి రూ.490 లోపు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ ధరతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కోకో సాగు చేయాలని ఈ సాగుకు ప్రోత్సాహాన్ని అందించేలా ఇప్పటికే కలెక్టర్, ఉద్యాన శాఖాధికారులు పలుమార్లు కోకో రైతులకు సమావేశాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో 100 ఎకరాలు సాగుచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న కోకో గింజల వ్యాపారులు మాట్లాడుతూ రైతులు తగిన నాణ్యత ప్రమాణాలతో గింజలను తయారు చేయడంలేదని, అందువల్లే తాము కొనుగోలు చేయడం నిలిపివేశామని తెలిపారు. కోకో సాగుకు సంబంధించి ఈనెల 17న అమలాపురం కలెక్టరేట్‌లో కోకో సాగు రైతుల సమావేశం ఉందని అక్కడ కొనుగోలు వ్యాపారులతో చర్చించి సానుకూలమైన నిర్ణయం కలెక్టర్ తీసుకుంటారన్నారు. సమావేశంలో కృషీవల సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, బీకేఎస్ జిల్లా అధ్యక్షులు చేకూరి సూర్యనారాయణ, రాష్ట్ర కోకో సాగురైతు సహాయ కార్యదర్శి అడబాల రాజమోహన్ పాల్గొన్నారు.

రక్షణ వలయంలో సముద్రతీర ప్రాంతం

- పూర్తిస్థాయిలో గస్తీ చర్యలు చేపడతాం
- అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు



విలేకర్లతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ

అంతర్వేది, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పశ్చిమ గోదావరి జిల్లాల కోస్టల్ తీర ప్రాంతానికి రక్షణ వలయంగా పూర్తిస్థాయి భద్రతా చర్యలు చేపడుతున్నట్టు అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు తెలిపారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్రతీరంలో ఉన్న మెరైన్ పోలీస్‌స్టేషన్ రికార్డులను ఆదివారం ఆయన పరిశీలించారు. అల్లవరంనుంచి అంతర్వేది మీదుగా పేరుపాలెం వరకు ఉన్న మెరైన్ సిబ్బందికి తీర ప్రాంతంపై పలు సూచనలు అందించారు. అనంతరం అంతర్వేది సాగర సంగమంవద్ద ఏర్పాటు చేసిన వాచ్ టవర్స్‌ను పరిశీలించారు. తీరంలో ఏ ప్రమాదాలు జరగకుండా ఏటీవీ బైకును పరిశీలించి ట్రయల్‌రన్ నిర్వహించారు. పర్యాటకులకు, సందర్శకులకు తీర ప్రాంతంలో మౌళిక సదుపాయాలు కల్పిస్తూ వారి రక్షణకు ఎప్పటికప్పుడు సంరక్షించే విధంగా వాచ్ టవర్స్‌పై వారి మెలకువలను గమనించేలా గస్తీ చర్యలు నిర్వహిస్తున్నామన్నారు. సముద్రం లోపలికి వెళ్లకుండా అగంతకులు, అపరిచితులు తీర ప్రాంతంలో గుర్తుతెలియని సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోలార్ సిస్టమ్‌తో కూడిన లైట్లు, సీసీ కెమెరాలను సాగర సంగమం వద్ద ఏర్పాటుచేశామని తెలిపారు. రక్షణ వ్యవస్థలో భాగంగా సముద్ర తీరమంతా అటు గస్తీ చర్యలు చేపట్టడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెరైన్, కోస్టల్ సెక్యూరిటీ, పోలీసు శాఖలకు బాధ్యతుల అప్పగించిందని, 61రోజులు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లరాదని, తీరం వెంబడి ఉన్న అంతర్వేది, ఓడలరేవు, పేరుపాలెం బీచ్‌లలో పర్యాటకులు, సందర్శకులు జాగ్రత్తలు పాటిస్తూ స్నానాలు ఆచరించాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో సందరిచేస్తూ సేద తీరాలే గానీ ప్రమాదాలకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. మెరైన్ సిబ్బందికి తీరప్రాంత గస్తీ చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. సీఐ నవీన్‌నరసింహమూర్తి, ఎస్‌ఐలు సోమశేఖరరెడ్డి, నాగార్జునరావు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం..



భారీ వృక్షాలతో నిండిన రాయనపేట - వెంకటరెడ్డిపేట రహదారి ఎటపాక (ఆంధ్రజ్యోతి)



పచ్చటి చెట్లతో ఆహ్లాదకరంగా మారిన సామర్లకోట - కాకినాడ ప్రధాన రోడ్డు సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

వేమగిరిలో...
84 అడుగుల బుద్ధ విగ్రహం ప్రారంభం



వేమగిరిలో బుద్ధ విగ్రహాన్ని ప్రారంభించి ధర్మహాలును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



కడియం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో బౌద్ధ మతం ఉందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా వేమగిరి బుద్ధవిహార్‌లో మహోదయ యాజరా ఏర్పాటు చేసిన 84 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ధర్మహాలు, వాటిలోని వివిధ రచయితల పుస్తకాలను పరిశీలించారు. పచ్చని నర్సరీల ప్రాంతంలో బుద్ధ విహార్ కేంద్రం ఏర్పాటు చేసిన యాజరాను గోరంట్ల అభినందించారు. బుద్ధవిహార్ అభివృద్ధికి రూ.25 వేలు ఇస్తున్నట్టు ప్రకటించారు. చైనా, జపాన్, కంబోడియా, కొరియా, చైనా వంటి దేశాల్లో విస్తరించి ఉండడంతో బౌద్ధ మతం ప్రపంచమతంగా ఉందన్నారు. రచయిత గౌరవ్ రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. యాజరా బౌద్ధమతం గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గోరంట్లను సత్కరించారు. కార్యక్రమంలో పేరవరం పిరమిడ్ ధ్యానకేంద్రం ట్రస్ట్ అధ్యక్షుడు సీఎస్ మూర్తి, టీడీపీ రాష్ట్ర నాయకుడు మార్గాని సత్యనారాయణ, కోలా వెంకట్రాజు(కేవీఆర్), అక్కిన ఆనందబాబు, చందన నాగేశ్వర్, షేక్ మీరావలి, బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, దాసరి ముత్యం తదితరులున్నారు.

అప్పు తీర్చమన్నందుకు.. అతి కిరాతకం!

దొమ్మేరు హత్య కేసులో వీడిన మిస్టరీ, ముగ్గురి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమన్నందుకు పథకం ప్రకారం వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్య చేసిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన పెండ్యాల ప్రభాకరరావు వేస్టేజి కంపెనీ ఉత్పత్తుల ఏజెంట్ల ద్వారా విక్రయిస్తుంటాడు. పోలవరం మండలం పాత పట్టిసంకు చెందిన చుక్కా రామ శ్రీనివాస్ తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామ సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లు, విలాసాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. ఇద్దరికీ గత కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. దీంతో 2024 డిసెంబర్‌లో ప్రభాకరరావు వద్ద శ్రీనివాస్ రూ.2,40,000 అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని ప్రభాకరరావు పదే పదే అడిగేవాడు. అతడి చంపేస్తే బాకీ తీర్చనవసరం లేదు, ఒంటిపై ఉన్న బంగారపు వస్తువులు అమ్ముకుని ఇతర బాకీలు తీర్చుకోవచ్చని శ్రీనివాస్ నిర్ణయించుకున్నాడు.

పథకం ప్రకారం రప్పించి...

దీంతో దొండపూడి గ్రామానికి చెందిన అంకోలు జగదీశ్ దుర్గాప్రసాద్, పోలవరానికి చెందిన నోముల ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పథకం వేశాడు. 2025 మార్చి 26న రాత్రి 8 గంటలకు ప్రభాకరరావుకు ఫోన్ చేసి బయటకు రప్పించాడు. యాక్టివా మోటారుసైకిల్‌పై ప్రభాకరరావు, శ్రీనివాస్ దొమ్మేరు పుంతలోని నీరుకొండ శేషగిరిరావు డ్రాగన్‌ఫ్రూట్ తోటలోకి వెళ్లారు. ప్రభాకరరావును శ్రీనివాస్ కత్తితో వెనుక నుంచి తలపై, వీపుపై పలుమార్లు దాడి చేశాడు. కిందపడిన తరువాత కంఠంపై నరికివేసి కిరాతకంగా హతమార్చాడు. తరువాత మెడలో ఉన్న బంగారపు గొలుసు, ఎడమచేతికి ఉన్న ఉంగరం తీసుకున్నాడు. కుడి చేతికి ఉన్న బంగారపు కడి యం, 3 ఉంగరాలు తీయబోగా రాకపోవడంతో కుడిచేతి గుత్తిని నరికి చేతిని పేపర్లో చుట్టుకుని, చెయ్యి, హత్యకు ఉపయోగించిన కత్తి, దొంగిలించిన బంగారపు గొలుసు, ఉంగరం సెల్‌ఫోను బ్యాగులో పెట్టుకున్నాడు. దుర్గాప్రసాద్‌ను రమ్మని ఫోన్ చేసి దొమ్మేరు, కాపవరం మీదుగా పోలవరం ఇంటికి వెళ్లిపోయారు. పోలవరంలో నో ముల ప్రవీణ్‌కుమార్‌కు విషయం చెప్పి, ము గ్గురు కలిసి నరికిన చెయ్యికి ఉన్న కడియం, 4 ఉంగరాలను తీసుకున్నారు. చెయ్యిని, కత్తిని, మృతుడు సెల్‌ఫోన్‌ని, హత్య చేసినప్పుడు శ్రీనివాస్ ధరించిన దుస్తులు, బ్యాగుని గూటాల గ్రామంలో గోదావరి నదిలోకి విసిరివేశారు. దొంగిలించిన బంగారం వస్తువులను కొయ్యలగూడెం, తాళ్లపూడి మండలాల్లో తాకట్టుపెట్టి ముగ్గురు పరారయ్యారు. మృతుడి భార్య పెం డ్యాల అనంతలక్ష్మి అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.విశ్వం కేసు నమోదు చేశారు.

కేసును ఛేదించిన కొవ్వూరు పోలీసులు

విచారణ అనంతరం ఈనెల 12న హత్యకు పాల్పడిన ముగ్గురు నిందితులను సీఐ విశ్వం అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు. రామ శ్రీనివాస్ నుంచి 31.8 గ్రాముల బంగారపు గొలుసు, 4.9 గ్రాముల ఉంగరం, నేరానికి ఉపయోగించిన హోండా ఎస్‌పి మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, జగదీశ్ దుర్గాప్రసాద్ నుంచి నేరానికి ఉపయోగించిన టీవీఎస్ రైడర్ మోటారుసైకిల్, సెల్‌ఫోను, ప్రభాకరరావు నుంచి సెల్‌ఫోను, గూటాల వద్ద గోదావరిలో పడవేసిన హత్యకు ఉపయోగించిన కత్తిని, మృతుడి సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. కేసు ఛేదించినందుకు కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, ఎస్‌ఐలు పి.రవీంద్ర, కె.శ్రీహరిరావు, కె.జగన్మోహనరావు, సిబ్బందికి డీఎస్పీ రివార్డులను అందజేశారు.



వారెవ్వా అనేలా.. పెరట్లో అరటిగెల..

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం పెదపేటలో పల్లికొండ రాధా ఇంటి పెరట్లో అరటిగెల అబ్బురపరుస్తుంది. బూడిద అరటిరకం చెట్టుకు 22 అస్తాలతో గెల పెరిగింది. ఒక అస్తానికి 22 కాయలు కాశాయి.

- ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి)

'లోవ'లో వార్షిక జాతర ప్రారంభం



జాతరను ప్రారంభిస్తున్న దృశ్యం

తుని రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ వార్షిక జాతర వేడుకలు ఆదివారం ప్రాంభమయ్యాయి. అమ్మవారి ప్రతిరూపంగా పూజించే గరగలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బాజాభజంత్రీలు, గరగల నృత్యాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, ఆలయ ఈవో విశ్వనాధరాజు అమ్మవారి గరగలు శిరస్సున ధరించి ఉత్సవాలను ప్రారంభించారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈనెల 27న లోవకొత్తూరు గ్రామంలో గంధ అమావాస్య వేడుకను దేవదయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

రూ.5.8 లక్షల ఆదాయం

లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.5.8 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో తెలిపారు.

కొంతమూరులో నెమళ్లు

కుక్కల బారి నుంచి కాపాడిన స్థానికులు



కుక్కల బారి నుంచి కాపాడి నెమలిని అధికారికి అప్పగిస్తున్న స్థానికులు



కాలి వేళ్లు వంకర ఉన్న నెమలిని ఫారెస్ట్ రేంజర్‌కు అప్పగిస్తున్న స్థానికులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో రెండు నెమళ్లు సందడి చేశాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కొంతమూరు శేషాద్రి హిల్స్ ప్రాంతంలో ఆదివారం ఒక నెమలిని కుక్కలు తరుముండగా స్థానికులు కాపాడి రాజమండ్రి ఫారెస్ట్ రేంజర్ దావీద్‌రాజుకు అప్పగించారు. తర్వాత మరో నెమలిని స్థానికులు తీసుకొచ్చి అప్పగించారు. ఇవి రెండూ ఆడ నెమళ్లు. వివరాలిలా ఉన్నాయి. కొంతమూరు శేషాద్రి హిల్స్ సమీపంలో ఆదివారం ఉదయం ఒక నెమలిని కుక్కలు తరుమున్నాయని చెప్పి, ఇక్కడి నివాసి అయిన కేవీ మాధవరావు, కుటుంబ సభ్యులు అనంతలక్ష్మి, సాత్విక్ దత్తు దానిని స్థానికుల సహాయంతో కాపాడి రేంజ్ ఆఫీసర్‌కు ఇచ్చారు. కొందరు స్థానికులు మరో నెమలిని తెచ్చి ఇచ్చారు. దానికి కాలికి వేళ్లు వంకరగా ఉన్నాయి. పుట్టుకతోనే అలా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి. ఎవరైనా తీసుకొచ్చారా? ఈ ప్రాంతంలోనే ఉంటున్నాయా? అనే కోణం నుంచి ఆరా తీస్తున్నట్టు దావీద్‌రాజ్ తెలిపారు. వీటికి ఏవిధమైన గాయాలు కాలేదని, సోమవారం వైద్యుడితో పరీక్షలు చేయించి ఉన్నతాధికారుల సలహాతో ఫారెస్ట్‌లో వదిలేయడం లేదా, జూపార్కుకు ఇవ్వడం విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం క్షేమంగా అటవీ అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. వీటి వయస్సు మూడేళ్ల నుంచి 4 ఏళ్లలోపు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

'జగన్ రూపంలో రాష్ట్రానికి పొంచి ఉన్న ప్రమాదం'

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి అతిపెద్ద ప్రమాదం, ఉపద్రవం వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రూపంలో పొంచి ఉందని ఇంటిలిజెన్స్ చీఫ్ విశ్రాంత అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంకలోని జనిపల్లి శ్రీనివాసరావు అలియాస్ కోడికత్తుల శ్రీను సహా ఆయన కుటుంబాన్ని ఆదివారం వెంకటేశ్వరరావు కలిశారు. వారితో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటానన్నారు. అనంతరం అమలాపురంలోని దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించిన తర్వాత ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నాకేదైనా సమాచారం ఇవ్వాలన్నా, ముఖ్యమైన మెసేజ్ చేయలన్నా, వాట్సాప్ నెంబరు 7816020048కు మెస్సేజ్ చేయవచ్చు' అని ప్రజలకు పిలుపునిచ్చారు. కోడి కత్తి శ్రీను కుటుంబానికి అన్నివిధాలా సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉత్కంఠభరితంగా..

వెలుగుబందలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి పరుగు పోటీలు
ప్రథమస్థానంలో అనకాపల్లి
ద్వితీయస్థానం సొంతం చేసుకున్న కోనసీమ



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల బండి

రాజానగరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలో గ్రామదేవత శ్రీసత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కూటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండి రౌండ్ పరుగు పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 23 జతల ఎడ్ల బండ్లు సత్తా చాటాయి. జిల్లాలోనే తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా లెక్కలవానిపాలేనికి చెందిన పెద పైడితల్లమ్మ(సత్తిబాబు) ఎడ్ల బండి ప్రథమస్థానం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల తేజా చౌదరికి చెందిన ఎడ్ల బండి ద్వితీయస్థానం, విజయనగరం జిల్లాకు చెందిన కె.రాము నాయుడికి చెందిన ఎడ్ల బండి తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే విజయనగరం జిల్లా వావిలిపాడుకు చెందిన మరిడి మాంబకు చెందిన ఎడ్ల బండి నాల్గోస్థానం, అనకాపల్లి జిల్లా అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడుకు చెందిన ఎడ్ల బండి ఐదో స్థానం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల తేజాచౌదరి ఎడ్ల బండి ఆరో స్థానం, అనకాపల్లి జిల్లా రేవళ్లకు చెందిన పంచాడ వెంకటరావుకు చెందిన ఎడ్ల బండి ఏడో స్థానం, అనకాపల్లి జిల్లా దేవరపల్లికి చెందిన శ్రీవీరాం జనేయకు చెందిన ఎడ్ల బండి ఎనిమిదో స్థానంలో నిలిచాయి. న్యాయ నిర్ణేతగా మజ్జి దేవానంద్ వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బహుమతి ప్రదానం చేశారు.



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

నూకాలమ్మ ఆలయానికి రూ.11లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మలికిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లిలో నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి లక్కవరానికి చెందిన ముదునూరి సుబ్బరాజు-లక్ష్మీనర్సాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ముదునూరి సత్యసూర్యసీతారామరాజు, ముదునూరి వెంకటసుబ్బరాజు, ముదునూరి గోపాలకృష్ణంరాజు (చినబాబు) రూ.11 లక్షల విరాళాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. నూకాలమ్మ చారిటబుల్ ట్రస్టుకు విరాళాన్ని అందించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు సుంద్ర బ్రహ్మాయ్య, కటికిరెడ్డి సత్యనారాయణ, కటికిరెడ్డి గోపాలకృష్ణ, దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ముువ్వన్నెల వర్ణం!

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో ఆదివారం జాతీయ పతాకాన్ని తాకతున్నట్టు ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది.

- గండేపల్లి (ఆంధ్రజ్యోతి)

శ్రీవారికి శ్రీపుష్పోత్సవం

ముగిసిన వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు



స్వామివారికి ఏకాంత సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి శ్రీపుష్పోత్సవం వేడుకగా నిర్వహించారు. విద్యుత్, ఫలపుష్ప అలంకరణ సాంస్కృతిక ప్రదర్శనలు, కళాకారుల వాయిద్యాలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం స్వామివారికి మేలుకొలుపు, నిత్యార్చన, నిత్యహోమాలు, దిగ్దేవత బలిహరణ, ద్రవిడ వేదపారాయణం, నిరాజన మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ద్వాదశ ప్రదక్షిణలు, ఫలప్రసాద నివేదన, ముఖమండపంలోని స్వామివారి అద్దాల మేడలో శ్రీపుష్పోత్సవం కనుల పండుగగా జరిగింది. ఫలపుష్పాలతో అలంకరించిన ఊయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ జరిగింది. ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. అశేషభక్తజనం కల్యాణోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వామివారికి ఫలప్రసాద నివేదన

సీతారాములకు శ్రీపుష్పయోగం

అన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రపాలకులైన సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి శ్రీపుష్పయోగంతో ముగిసాయి. రాత్రి 8 గంటలకు నవదంపతులైన సీతారాములను, పెళ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను వేర్వేరు వేదికలపై ఆసీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం నవ దంపతులకు వివిధ సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన ఊగుటూయలలో ఆసీనులు గావించి పుష్పార్చన చేశారు. వివిధ రకాలైన మధురఫలాలు, తీపి పదార్థాలను నివేదించారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీతాంబూలాలు అందజేశారు. ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ఊగుటూయలలో సీతారాములు

పేకాడుతున్న పది మంది అరెస్టు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శనివారం ఇంద్రపాలెం, కోరింగ, గొల్లపాలెం ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఒక గదిలో పేకాటడుతున్న పది మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రదేశంలో లభించిన రూ.42,750, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు ఇంద్రపాలెం ఎస్ఐ సూర్యకుమార్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఇంటి కాంపౌండ్‌లో పేకాట ఆడుతుండటం విశేషం. మాజీ ఎమ్మెల్యే స్థానికంగా నివాసం ఉండకపోవడంతో కొంతమంది దీనిని పేకాట శిబిరంగా మార్చినట్టు స్థానికులు చెప్తున్నారు.

ఘనంగా బంగారమ్మ అమ్మవారి తీర్థం

అంబాజీపేట, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):ఇసుకపూడి గ్రామదేవత శ్రీబంగారమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం నిర్వహించారు. శనివారంరాత్రి నిర్వహించిన అమ్మవారి జాతరలో గరగనృత్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జయంతి

అమలాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించనున్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి జరిగే జయంతి ఉత్సవాల్లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

పేదలకు బాసటగా రాష్ట్ర ప్రభుత్వం

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పేదలకు బాసటగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.34లక్షల చెక్కులను 59మందికి అందజేశారు. పది నెలల కాలంలో 206మందికి రూ.2కోట్లు సీఎం సహాయనిధి నుంచి సహాయం అందించామన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో అవకాశం లేని పేదలందరికీ సీఎం సహాయ నిధి నుంచి సహాయం అందిస్తున్నామన్నారు. కూటమి నాయకులు ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, పినిశెట్టి బుజ్జి, అడబాల యుగంధర్, మల్లెపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, జక్కంపూడి శ్రీదేవి, చెల్లుబోయిన హెలీన, లలితాశివజ్యోతి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

చేతి సంచుల పంపిణీ

లక్కవరంలో మానవతా మూర్తులు సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో వారణాశి నాయుడు సమకూర్చిన 2వేల చేతి సంచులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ జీవితం అతలాకుతలం అవుతుందన్నారు. కార్యక్రమంలో మానవతామూర్తుల నాయకులు బోనం రాజు, దిరిశాల బాలాజీ, మంగెన నాని, అడబాల యుగంధర్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, పినిశెట్టి బుజ్జి, జాన శంకరరావు పాల్గొన్నారు.

రూ.10కోట్లతో రోడ్లకు ప్రతిపాదనలు..

రాజోలు నియోజకవర్గంలో తొమ్మిది రోడ్లకు రూ.10కోట్లతో ప్రతిపాదనలు పంపామనిఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. వీటిలో నాలుగు రోడ్లకు రూ.2.75కోట్లు మంజూరైనట్టు తెలిపారు. రాజోలు-పొన్నమండ, మొగలికుదురు-ములికిపల్లి రోడ్డు, సోంపల్లి-అంతర్వేది, మామిడికుదురు-మగటపల్లి నాలుగు రోడ్లకు 6.62కిలోమీటర్లు వేయడానికి రూ.2.75 కోట్లు మంజూరైందన్నారు. మరో 5రోడ్లు 14.5కిలోమీటర్లు 6.85కోట్లతో వేయడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వీటిలో దిండి-రామరాజులంక, శివకోడు-మట్టపర్రు, విశ్వేశ్వరాయపురం-దిండి, గూడపల్లి-శేషనపల్లి రోడ్లకు ప్రతిపాదనలు పంపామన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న కరుణాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి:ఎమ్మెల్యే

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో నడుస్తున్న రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. మతం పేరుతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ మూకలు చూస్తున్నాయని విమర్శించారు. అమలాపురం టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతుందన్నారు. ఇదే తరహాలో రాష్ట్ర పాలన సాగితే వైసీపీకి పుట్టగతులు ఉండవని భావించే రాష్ట్రాన్ని అల్లరిపాలు చేసేలా విద్వేషాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. గురివింద గింజ సామెత తరహాలోనే టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన కరుణాకరరెడ్డి హయాంలో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్ల అమ్మకాల కుంభకోణం మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. టీటీడీ గోశాలలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఆవులు చనిపోయాయి, వాటిలో ఎన్నింటికి పోస్టుమార్టం చేయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యాధులు సోకి, వృద్ధాప్యంతో గోవులు చనిపోవడం సహజమేనన్నారు. ప్రస్తుతం టీటీడీ గోశాలలో 2668 గోవులు ఉండగా వాటి అన్నింటికీ జియో ట్యాగింగ్ చేయించామన్నారు. వాటి సంరక్షణకు 168 మంది ఉద్యోగులు నిరంతరం శ్రమిస్తున్నారని వివరించారు. అసత్యాలను ప్రచారంచేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కరుణాకరరెడ్డిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోకపోతే మరికొన్ని మూకలు రెచ్చిపోయే ప్రమాదం ఉందని ఆనందరావు పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వామక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మల్లుల పోలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేయాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బ తీసేలా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారని టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు విమర్శించారు. పి.గన్నవరం కూటమి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరుణాకర్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న సమయంలో మరణించిన గోవుల ఫొటోలను ఇప్పుడు సోషల్ మీడియాలో పోస్టుచేసి కూటమి ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. టీటీడీ టీటీడీ గోశాలలో మూడు నెలలుగా 100గోవులు మరణించాయని చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న 2688గోవులు ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న కరుణాకర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మద్దాల సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధర్, అయినవిల్లి మండల అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సంసాని పెద్దిరాజు, గణపతి వీరరాఘవులు, సలాది పుల్లయ్యనాయుడు, చుట్టుగుళ్ల కిషోర్, చిన్నం బాలవిజయరావు, బడుగు జోగేష్, బిక్కిన బాబి, యండ్ర శ్రీనివాస్, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ, బడుగు వెంకటేష్, రుద్ర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

‘వర్గీకరణ పేరుతో మాలలను అణచివేసే కుట్ర’



సమావేశంలో మాట్లాడుతున్న రఘుబాబు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో మాలలను అణచివేసే విధంగా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొడదామని కోనసీమ జిల్లా మాలల ఐక్య వేదిక సమావేశం పిలుపునిచ్చింది. ఆదివారం బండారులంకలో ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు ఆధ్వర్యంలో మాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు డీబీ లోక్ మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు వ్యవస్థాపకుడు పీవీరావు జీవితాంతం పోరాటం సాగించారని గుర్తుచేశారు. వర్గీకరణపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టి ఇష్టానుసారం వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఇవ్వడం దారుణమన్నారు. 2011జనాభా లెక్కల ఆధారంగా వన్‌మెన్ కమిషన్ అంకెల గారడీతో వర్గీకరణకు ఆమోదం తెలపడం అన్యాయమన్నారు. ఈనెల14న అంబేడ్కర్ జయంత్యుత్సవాలను నిర్వహించేందుకు సమావేశం నిర్ణయించింది. అడ్డగోలుగా జరిగిన ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి అదేవేదికగా అల్టిమేటం జారీ చేస్తామని ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, గొల్లపల్లి డేవిడ్, బత్తుల మురళీ, బొంతు మణిరాజ్, కోట రామ్మోహన్, రవ్వా భూషణం, బడుగు జేమ్స్‌పాల్, బొంతు బాలరాజు, నక్కా సవంత్‌కుమార్, కప్పల శ్రీధర్, కాకర శ్రీను, గూటం సాయి, పినిపే జయరాజ్, నెల్లి లక్ష్మీపతి, ఊటాల వెంకటేష్, మెండు రమేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి చంద్రబాబు కృషి



ఉప్పలగుప్తం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు, అక్రిడేషన్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఏపీ జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్.యానాంలో నిర్వహించిన అంబేడ్కర్ మెమోరియల్ బీచ్ వాలీబాల్ టోర్నమెంటు విజేతలకు ఆదివారం షీల్డులు బహూకరించారు. విజేత అనంతపురం, రన్నర్ తూర్పుగోదావరి, తృతీయ స్థానంలో నిలిచిన నెల్లూరు జట్లకు ఆయన బహుమతులందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులం ప్రసాద్, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగస్వామి, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మూర్తి, తెలుగురాష్ట్రం ఎడిటర్ అయితాబత్తుల రాజశేఖర్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ బోళ్ళ సతీష్‌బాబు, పీఈటీలు గొలకోటి ఫణీంద్రప్రసాద్, శివకుమార్, సీతారామారావు పాల్గొన్నారు. వ్యాఖ్యాతలుగా మహిళా జర్నలిస్టులు స్వప్న, శ్రీదేవి వ్యవహరించారు.

ఛత్రపతి శివాజీ వర్ధంతి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ ఛత్రపతి శివాజీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బుద్ధవిహార్ జనరల్ సెక్రటరీ డీబీ లోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలువేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ పోరాట పటిమను ఆయన అందించిన సుపరిపాలనను చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, జయంతిరావు, ఆంజనేయులు, రామ్మూర్తి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కోడికత్తి శ్రీను కుటుంబానికి అండగా ఉంటా

ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు



అమలాపురంలోని బాలయోగి ఘాట్‌లో నివాళులర్పిస్తున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

ముమ్మిడివరం/ఐ.పోలవరం:ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జగన్ బాధితుడు, దళిత వర్గానికి చెందిన జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటానని ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక గ్రామానికి చెందిన కోడికత్తి శ్రీను కుటుంబసభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. అరగంటసేపు కోడికత్తి శ్రీనుతోపాటు తల్లిదండ్రులు పాపారావు-సత్యవతి, సోదరులు సుబ్బరాజులతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ బాధితులకు అండగా ఉండి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో శ్రీను కుటుంబంనుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పెట్టా వరప్రసాద్, జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పిల్లా శ్రీనివాస్, న్యాయవాది సలీం ఉన్నారు.

బాలయోగి సేవలు చిరస్మరణీయం

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంత అభివృద్ధికి లోక్‌సభమాజీ స్పీకర్, దివంగత నేత జీఎంసీ బాలయోగి అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని ఇంటిలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. అమలాపురంలోని బాలయోగి స్మారక చిహ్నాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. తొలుత జిల్లా అడ్మిన్ ఎస్పీ ప్రసాద్ ఏబీ వెంకటేశ్వరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వెంకటేశ్వరరావు ఘాట్‌లో బాలయోగి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు కోడికత్తి శ్రీను, లాయర్ సలీం, శ్రీను తల్లిదండ్రులు పాల్గొన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్ వద్ద ఏబీవీని గోకాడ రాంబాబు మిత్ర బృందం, బీజేపీ జాతీయ నాయకులు నల్లా పవన్‌కుమార్ సత్కరించారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

అంతర్వేది, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారతజాతికి ఆదర్శప్రాయుడని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలాధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుభ్రంచేసి పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం అంబేడ్కర్‌కు ఎనలేని గౌరవం ఇస్తుందని, అంబేడ్కర్‌కు భారతరత్న అందజేసి పార్లమెంటు హాలులో అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహాన్ని ఏర్పాటుచేసిందని, అంబేడ్కర్ నడయాడిన ఐదు ప్రదేశాల్లో పంచ తీర్థాల పేరుతో అభివృద్ధి చేసిందని మాలే శ్రీనివాసనగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరి సుబ్బరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు, ఆకన వెంకట్రావు, కాళ్లకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చండీ హోమం

కాట్రేనికోన, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆదివారం మావుళ్ళమ్మ ఆలయంలో చండీ హోమం వైభవంగా నిర్వహించారు. హోమాన్ని తిలకించి భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆణివిళ్ళ ఫణికాంత్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంధి రామ్‌ప్రసాద్, ఆణివిళ్ళ సాయిబాబా, గ్రంధి నానాజీ, రామకృష్ణపరమహంస, సుంకర పవిత్రకుమార్, సుంకర బుజ్జి పాల్గొన్నారు.

డాక్టర్ కొల్లూరికి సత్కారం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ సాహిత్య సమ్మేళనంలో అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి పాల్గొన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, శ్రీసాంస్కృతిక కళాసారథి సింగపూర్, వంశీ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ కొల్లూరి మహాకవుల కలాలలో మహాత్ముడు అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించారు. కవి సమ్మేళనంలో ప్రబోధాత్మకమైన రెండు గజల్స్‌ను ఆలపించారు. రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత అయిన కొల్లూరిని ప్రశంసిస్తూ వంశీ ఇంటర్నేషలన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ రచయిత శ్రీసుధలు సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

కొవ్వొత్తులతో నివాళి



అమలాపురం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు బొంతు శివాజీ అధ్యక్షతన ఇమ్మిడివరప్పాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రంచేసి దీపాలంకరణచేశారు. కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సోరపల్లి పద్మినీకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, అరిగెల నాని, పి.వెంకటేశ్వరరావు, రామదాసు, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

సంగీతంలోని 72 స్వరాలను నేర్పడమే లక్ష్యం

పి.గన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సంగీతంలో ఉన్న 72 స్వరాలను లక్ష మందికి నేర్పించడమే తన లక్ష్యమని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, ప్రముఖ రచయిత, సినీ సంగీత దర్శకుడు స్వర వీణాపాణి అన్నారు. ముంగండ శ్రీచింతామణి గణపతి మందిరంలో శ్రీత్యాగరాజఆరాధన సమితి(ముంగండ), తెలంగాణ, ఆంధ్ర బ్రాహ్మణ సంక్షేమ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 72మేళకర్త రాగాల అవగాహన సదస్సు, సప్తస్వర అవధాన వైజయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంగీతంలో ఉన్న సాహిత్యం, స్వరాల మెళకువలు తెలుసుకుంటే సంగీతాన్ని పూర్తి స్థాయిలో సాధనచేయవచ్చన్నారు. తొలుత స్వర వీణాపాణి, విశిష్ట అతిథి ప్రముఖ సినీ పాటల రచయిత, సాహితవేత్త పరిమి కేదార్నాథ్, రాష్ట్ర ఉగాది సాహితి పురస్కార గ్రహీత, సంధానకర్త తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, ప్రముఖ తబలా కళాకారుడు టి.మోహన్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక సభ్యులు ఆంధ్రఅన్నపూర్ణ డొక్కా సీతమ్మ నివాసాన్ని సందర్శించి సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అలాగే నివాసంలో భోజనాలు చేశారు. అలాగే గ్రామంలోని ప్రముఖ దేవాలయాలను సందర్శించారు. ప్రముఖ పురోహితులు మిర్తిపాటి నారాయణ, సూర్యకుమారిలకు నివాళులర్పించారు. సాయంత్రం బోధామృత శ్రీకృష్ణగీత పుస్తక పరిచయంతో పాటు పెద్దలకు చిరుసన్మానం, సర్టిఫికేట్లు అందించే కార్యక్రమాలు జరిగాయి. సినీగేయ రచయిత పరిమి కేదారనాథ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆంధ్ర, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ వేదిక సభ్యులు బాల శ్రీనివాస్, వేముల కిషన్‌రావు, గోళ్ళపల్లి ఫణీంద్ర, నేరళ్ల మల్లికార్జున, రవి పరస, మిర్తిపాటి రామం పాల్గొన్నారు. ముంగండలో ఇటీవల విశ్రాంత ఎంఈవో నడిమింటి నాగరాజారావు మరణించగా గణపతి మందిరంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు



వైజయంతి కార్యక్రమంలో పాల్గొన్న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ స్వర వీణాపాణి

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మామిడికుదురు: పెదపట్నంలంకలో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని ఊరేగింపు చేస్తున్న క్రైస్తవులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభువు పేరిట వచ్చిన దావీదు కుమారునికి జయము జయము అంటూ అమలాపురం సావరం రోడ్డులోని బేతేలు ప్రార్థనా మందిరం బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. రెవ. గొలకోటి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ శాంతి, సమాధానాలతో ఉండాలని జయంత్యుత్సవం నిర్వహించారు. మానవాళిని పాపం, శాపం నుంచి విముక్తి కలిగించేందుకు దావీదు కుమారుడు గాడిదపై సమాధానానికి సాదృశ్యంగా తిరిగి వచ్చినట్టు సత్యప్రసాద్ తెలిపారు. నీతిపరుడు, దీనమనసు గల క్రీస్తుకు జయము కలుగుగాక అంటూ నిర్వహించిన ర్యాలీలో అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మట్టల ఆది వారం నేపథ్యంలో పలు గ్రామాల్లో చర్చిలు వద్ద మట్టలు చేతపట్టుకుని భక్తులు ర్యాలీలు నిర్వహించారు. పోతవరం లూర్దుమాత ఆల యంలో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిలో మట్టలు పట్టుకుని క్రైస్తవులు ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. బెల్లంపూడి ముత్య య్యలూధరన్ చర్చి, నాగుల్లంక, కందాలపాలెం, చాకలిపా లెం, మానేపల్లి, పి.గన్నవరం, ఉడిమూడి, నరేంద్రపురం, కుందాలపల్లి గ్రామాల్లో క్రైస్త వులు మట్టలు చేతపట్టు కుని ర్యాలీలు నిర్వహించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ఏసు ప్రభువు ఎరుసలేం ప్రవేశించిన ఘట్టాలను గుర్తుచేసుకుంటూ నిర్వహించే మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మానవుల పాపాలను తొలగించే లక్ష్యంతో ప్రభువు ఎరుసలేం పట్టణంలోకి ప్రవేశించాడని పాస్టర్లు వివరించారు. మామిడికుదురు, లూటుకుర్రు, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, నగరం, మాకనపాలెం గ్రామాల్లో మట్టలు చేతబూని భక్తులు ప్రదక్షిణ చేశారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అంబేడ్కర్ జయంతి ప్రత్యేక నాణేలు



అమలాపురం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ముంబై టంకశాల విడుదల చేసిన అరుదైన నాణేలను అమలాపురం పట్టణానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు. అంబేడ్కర్ శయ జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం అంబేడ్కర్ ముఖచిత్రంతో 1990లో రూపాయి నాణాన్ని విడుదల చేసింది. 2015లో 125వ జయంతిని పురస్కరించుకుని రూ.10, రూ.125 నాణేలను విడుదల చేసింది. వీటిని కృష్ణకామేశ్వర్ సేకరించి అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రదర్శనకు ఉంచారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.23వేలు విరాళం

అయినవిల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అయినవిల్లికి చెందిన అడ్డాల కృష్ణదుర్గాప్రభాకరం-సుబ్బలక్ష్మి దంపతులు ఆదివారం శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాదట్రస్టుకు రూ.23వేలు అందజేశారు. ఆలయ ప్రధానఅర్చకులు ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

మలికిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మోరి శ్రీమతిజానసుబ్బమ్మ జిల్లా పరిషత్ హైస్కూలులో రూ.12లక్షలతో నిర్మించిన జానసత్యనారాయణవిజయలక్ష్మి సన్మిత్ర సభా మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ జాన వీరభద్రప్రసాద్ (ఎంఎస్ఎన్) మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. 1985-86 బ్యాచ్ విద్యార్థులు రూ.9లక్షలు, 1984-85బ్యాచ్ విద్యార్థులు రూ4లక్షలు, 1994 బ్యాచ్ విద్యార్థులురూ.లక్ష అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ జాన వీరభద్రప్రసాద్ రూ.5లక్షలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పసలపూడి లక్ష్మీపద్మమంగతాయారు, ముప్పర్తి నాని, ఎంపీటీసీ జాన సూర్యావతి, ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ జాన శంకరరావు, డాక్టర్ కేసీఎంఎల్ శ్రీనివాస్, ఎంఈవో ఎం.వెంకటేశ్వరరావు, ముప్పర్తి సత్యశ్రీనివాసరావు, ఉప్పుగంటి దత్తుడు పాల్గొన్నారు.

మెరైన్ పోలీసుస్టేషన్‌ను సందర్శించిన అడిషనల్ ఎస్పీ

అల్లవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మెరైన్ అడిషనల్‌ఎస్పీ మధుసూదనరావు ఓడలరేవు మెరైన్ పోలీసుస్టేషన్‌ను, సముద్ర తీరాన్ని ఆదివారం సందర్శించారు. మెరైన్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. మెరైన్ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి, ఎస్ఐలు చినబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ కులాలకు 51 యూనిట్లు మంజూరు

అంబాజీపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్ కులాల యాక్షన్ ప్లాన్ కింద 51 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో జీవీ సరోవరరావు తెలిపారు. అర్హులైన వారు ఈనెల14నుండి ఆన్‌లైన్‌లో, నేరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ యాక్షన్ ప్లాన్‌లో అల్లవరం మండలానికి 50యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో మే 21లోగా వెబ్‌సైట్‌లో పెట్టాలన్నారు. రూ.3లక్షలలోపు యూనిట్లు 9 ఉన్నాయని, రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు 5యూనిట్లు, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో ఆరు యూనిట్లు ఉన్నాయన్నారు. యూనిట్ ధర రూ.3 నుంచి రూ.15లక్షలు ఉంటుందన్నారు.

వైభవంగా యల్లారమ్మ తీర్థం

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి గ్రామదేవత యల్లారమ్మ తీర్థం వైభవంగా జరిగింది. గ్రామస్తులు యల్లారమ్మకు ముడుపులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి యువత ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మేళతాళాలతో, బాణసంచా కాల్పులతో ఉత్సాహంగా నిర్వహించారు. కాగా తీర్థం రోజున వుండ్రు విష్ణుమూర్తి జ్ఞాపకార్థం వుండ్రు రాజబాబు, విష్ణురాజీవ్ దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

జయకు అభినందనలు

ఐ.పోలవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నాల్గవ ర్యాంకు సాధించిన జి.వేమవరానికి చెందిన కలికోటి జయఅజనిని సర్పంచ్ సుదర్శనరావు, పలువురు అభినందించారు. తాళ్ళరేవు మండలం కాపులపాలెం శ్రీరవి కళాశాలలో చదువుతోంది.

జీకే గ్రాండ్ రెస్టారెంట్ ప్రారంభం



అమలాపురంలో జీకే గ్రాండ్ రెసిడెన్సీ ప్రారంభంలో వాస్తు సిద్ధాంతి భీమేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, కాసుబాబు తదితరులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మార్కెట్ రోడ్డులో ప్రముఖ వ్యాపారవేత్త గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు(కాసుబాబు) నిర్మించిన జీకే గ్రాండ్ రెస్టారెంట్ అండ్, రెసిడెన్సీలో పలు విభాగాలను రాజకీయ ప్రముఖులు ఆదివారం ప్రారంభించారు. తొలుత జీకే గ్రాండ్‌ను కాసుబాబు ప్రారంభించగా ముఖ్య అతిథులుగా హాజరైన అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడులు వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ పంచాంగకర్త, వాసు సిద్ధాంతి కాలెపు భీమేశ్వరరావును రాజకీయ ప్రముఖల సమక్షంలో కాసుబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి-బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, అరిగెల బుజ్జి, జయన సత్తిరాజు, కురస రామకృష్ణ(కిట్టయ్య), పెద్దిరెడ్డి సత్తిబాబు, అధికారి వెంకటేశ్వరరావు, బసవా ప్రసాద్, కొర్లపాటి గణేష్, కంతేటి రాజా, దున్నాల దుర్గ, ఆశెట్టి ఆదిబాబు, పలువురు రాజకీయ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పసుపుకొమ్ముల పూజ

మామిడికుదురు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ సిరి సంపదలు, సౌభాగ్యాన్ని ప్రసాదించాలని లూటకుర్రు గ్రామంలో లక్ష పసుపుకొమ్ములు, గరిసె ధాన్యం పూజా కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గోకవరపు నాగేంద్ర, సూర్య వెంకటసత్యసుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పసుపుకొమ్ములతో పాటు ధాన్యాన్ని రాశులుగా పోసి వాటిపై గౌరీదేవి, మహాలక్ష్మి అమ్మవారి చిత్రాలు ప్రతిష్ఠింపచేసి చుట్టూ ముత్తయిదువులు ప్రదిక్షణచేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బి.సావరంలో అంబేడ్కర్‌కు నివాళి

రాజోలు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం బి.సావరంలో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా వేమా మాట్లాడుతూ అంబేడ్కర్ దార్శనిక ఆర్థికవేత్త అని, దక్షిణాసియా నుంచి ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందిన మొదటి వ్యక్తి అని తెలిపారు. ఉపాధి, విద్యా రంగాల్లో ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్ కల్పించాలని పట్టుబట్టి సాధించినట్టు పేర్కొన్నారు. ఈస్ఫూర్తితోనే బీసీలకు, మహిళలకు, మైనార్టీలకు రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయన్నారు. అనంతరం పేదలకు ఆయన చీరలను పంపిణీ చేశారు. వడ్లమూడి ప్రకాష్, చెల్లింగి త్రినాథ్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి.. రక్తదానం

యానాం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని కాకినాడ యువసేన బ్లడ్‌బ్యాంక్ సతీష్ సహకారంతో యానాం గోపాల్‌నగర్ అంబేడ్కర్ విజ్ఞానభవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించినట్టు యానాం బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, సబ్బతి లోకేశ్వరరావు, మూదే హరిచంద్ర తెలిపారు. ఈకార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏ మునిస్వామితో పాటు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 127మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పోనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్ల చంద్రరావు, పండు సిద్ధార్థకుమార్, నామాడి అప్పారావు, గిడ్డి బలరాం పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం

అయినవిల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లచెరువు శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అష్టమ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో స్వామివారు మోహినీ అలంకారంతో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీపట్టాభి రామచంద్రస్వామివారి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామి,అమ్మవార్ల దివ్య కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. గణేశుల వెంకటేశ్వరరావు-వెంకటసూర్యపద్మావతి, గణేశుల వంశీవికాస్-ప్రీతీ దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవ వేడుకలను ఈనెల15వరకు నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల15న తీర్థం జరుగుతుందని, అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అమలాపురం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని శ్రీమహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అలనాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు నరసింహారావు, యర్రమిల్లి పాండురంగారావు, వి.ఉమాదేవి, బి.భాగ్యలక్ష్మి, వెంగళ్‌దాస్, బందా ఆర్.కామేశ్వరరావులను అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుతో కలిసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పలువురు పూర్వ విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేశారు. సూదా నాగశ్రీనివాసరావు, సలాది తిరుపతిరావు, కలకొండ శ్రీనటరాజు, చంద్రమౌళి శర్మ, అల్లూరి శ్రీనివాసరాజు, తిరుపతి శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో జరిగిన అపూర్వ సమ్మేళనంలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో స్థిరపడ్డ స్నేహితుల బృందమంతా తరలివచ్చి అదే చదువుల చెట్టునీడన మరోసారి గ్రూప్ ఫొటో దిగారు.




వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు. పక్క చిత్రంలో విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆదాయం రూ.4.28 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం పలువురు భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,28,581 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. స్వామివారి అన్నప్రసాద భవన నిర్మాణానికి తణుకుకు చెందిన పురాణపండ వెంకటశివసాయిరామ్ రూ.50,001 విరాళం ఇవ్వగా, దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందచేశారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం



ఆలయంలో స్వామివారికి పుష్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు, తులసిపూజ, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారి పుష్పోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఆయా ఏర్పాట్లు నిర్వహించారు. వారం రోజులపాటు నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి.

వెదురుపాకలో ఘనంగా గీతాయజ్ఞం

రాయవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గీతా మందిరంలో ఆదివారం గీతాయజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పడాల శివమణి కంఠరెడ్డి, మానస దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. గ్రామానికి చెందిన అర్చకుడు అంగర జనార్దనాచార్యులు అర్చకత్వంలో గీతాయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు.



వెదురుపాకలో గీతా మందిరంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

పోలేరమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు



చెల్లూరులో పోలేరమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామస్థుల ఇలవేల్పు పోలేరమ్మ అమ్మవారి ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. పోలేరమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. చెల్లూరు పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మార్ని రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, పసల విద్యాధర్, పసల ప్రసాద్, ఒబిలిసేని మనిష్, కాదా శ్రీను, ఇళ్ల సత్తిబాబు, గుత్తుల శ్రీను, మామిడిశెట్టి రామకృష్ణ, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు. పక్క చిత్రంలో దర్శనానికి బారులుతీరిన భక్తులు

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల భక్తులు రాకతో కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో కొద్దిసేపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. పోలీసులు సకాలం లో స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కాగడాలు, తుళ్లబిళ్ల, వారపోయుట వంటి మొక్కుబడులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా ఎన్‌ఎస్‌కే క్రికెట్ టోర్నమెంట్

రావులపాలెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌కే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి సోషల్ మీడియాలో పరిచయమైన వారంతా రావులపాలెంలో దీన్ని నిర్వహించడం ఆనందకరమన్నారు. నీ స్నేహం గ్రూప్ ద్వారా సహాయ, సహకారాలు అందిం చడం శుభపరిణామమన్నారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సతీష్‌రాజు బహుమతులు అందచేశారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు సతీష్‌రాజు

ఆకట్టుకున్న బాబాసాహెబ్ పెయింటింగ్



విద్యార్థినుల చేతిలో రూపుదిద్దుకున్న దృశ్యం

మండపేట, ఏప్రిల్, 13(ఆంధ్రజ్యోతి) బాబాసాహెబ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండపేటలో వున్న సత్యఆర్ట్ అకాడమికి చెందిన ఇద్దరు విద్యార్థులు బాబాసాహెబ్ చిత్రపటాలను వేశారు. బాబాసాహెబ్ 134వ జయంతిని సందర్భంగా తమ అకాడమీ విద్యార్థినులు వీటిని వేశారని అకాడమీ నిర్వాహకుడు మందపల్లి సత్యనందం తెలిపారు. తమ అకాడమికి చెందిన పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు వి.శివలీల, ఆర్.మౌనిక దీన్ని వేశారని ఆయన తెలిపారు.

చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం వరకు సీసీ రోడ్డు

కె.గంగవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తామరపల్లిలో చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. ఆదివారం తామరపల్లిలో స్మశానవాటిక వరకూ నిర్మించిన సీసీ రోడ్డును మాజీ ఆర్టీసీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ నుంచి చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం వరకూ ఉన్న రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. టీడీపీ నాయకుడు గన్ని శ్రీనివాసు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): కూళ్ల గ్రామంలో నిర్మించిన ఆలయంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. పండితుడు సరస్వతుల రాంప్రసాద్ ఆధ్వర్యంలో రుత్వికులు పలు పూజలు చేశారు. ఈ పూజల్లో కె.సుబ్బరాజు, టి. బాలాజీ, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

ఆలమూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మట్టల ఆదివారం నిర్వహించారు. ఆలమూరు, పెదపళ్ల, చింతలూరు, జొన్నాడ, మూలస్థానం, పినపళ్ల, సంధిపూడి, చొప్పెల్ల, మడికి, చెముడులంక, బడుగువాని లంక, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు పెనికేరు తదితర గ్రామాల్లో మట్టల ఆదివారం సందర్భంగా ఈతమట్టలతో ఊరేగింపు చేసి ఆయా చర్చిలలో ప్రార్థనలు చేశారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం నిర్వహించారు. వెదురుపాక సీవీఎం చర్చి సెక్రటరీ కొండిపూడి ఏసురత్నం, పాస్టర్ డి.మాసిరమణి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండిపూడి సత్యప్రభ, కొండిపూడి చంటిబాబు, బత్తుల శ్రీను, క్రైస్తవులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలంలో మట్టల ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆదివారపుపేట, రావిచెరువు గ్రామాల్లో రాక్ చర్చిలో వాటిని నిర్వహించారు. అలంకరించిన ఈత ఆకులతో ర్యాలీ నిర్వహించారు. బిషప్ ఆనంద్‌కుమార్, బేబి రత్నకుమారి వాక్య సందేశం అందించారు.

రామచంద్రపురం పట్టణంలో: రామచంద్రపురం పట్టణంలో మట్టల ఆదివారం పురస్కరించుకుని ఈత ఆకులతో క్రైస్తవులు ప్రదర్శన జరిపారు. మెయిన్ రోడ్డులో న్యూ లైఫ్ సాలోమ్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



రావులపాలెంలో మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్చిలలో మట్టల ఆదివారం నిర్వహించారు. రావులపాలెం బేతస్త ప్రార్థన మందిర పాస్టర్ ఎన్వీ రావు ఆధ్వర్యంలో రావులపాలెం, ఈతకోట గ్రామాల్లో మట్టలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేరీ ప్రియ, రక్షణ్‌రాజా, పూర్ణ, పలువురు సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రాంతాల్లో మట్టల ఆదివారం జరిపారు. గంగవరంలోని క్రీస్తురాజు దేవాలయంలో పాస్టర్ ఎస్.వేలంగినిరావు ఆధ్వర్యంలో క్రైస్తవు లు మట్టలు పట్టుకుని గ్రామంలో ఊరేగుతూ దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ వేలంగినిరావు, చిట్టి రాజు ఈ సందర్భంగా మాట్లాడారు. మండలం లోని పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టలతో ఊరేగింపుగా చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మట్టల ఆదివారం నిర్వహించారు. బిషప్ జి.అబేద్నగో ఆధ్వర్యంలో సండే స్కూల్ పిల్లలు ఈతమట్టలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో క్రైస్తవులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ కృష్ణాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవం సందర్భంగా పల్లకీలో స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



డీఎస్పీ రఘువీర్‌తో మాట్లాడుతున్న ఎంపీ బోస్, సూర్యప్రకాష్

కేసుల నమోదుపై విచారణ చేపట్టాలి

డీఎస్పీని కలిసిన ఎంపీ బోస్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలో స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులపై కేసు నమోదు చేసిన వ్యవహారంపై విచారణ చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ డీఎస్పీ బి.రఘువీర్‌ను కోరారు. ఆదివారం ఎంపీ బోస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, భీమక్రోసుపాలెం సర్పంచ్ పలివెల లోవరాజు ఇతర నాయకులతో కలసి డీఎస్పీని కలిశారు. భీమక్రోసుపాలెంలో ఈనెల 8న లక్ష్మణరెడ్డిపై అదే గ్రామానికి చెందిన కునిశెట్టి వీరేంద్రరెడ్డి కత్తితో దాడి చేశారని తెలిపారు. ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేయగా మూడురోజులపాటు తిప్పించుకుని కేసు నమోదు చేశారని ప్రతిగా వీరేంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో బాధితుడితోపాటు గ్రామంలో లేనివారిపై కేసు నమోదు చేశారన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ బాధితులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ స్వయంగా తాను విచారణ జరుపుతానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, వైస్ ఎంపీపీ శాకాబాబి, కౌన్సిలర్లు కేతా శ్రీను, తోట సూరిబాబు, పార్టీ నాయకులు మట్టా బాబులు, వేల్పూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



యండగండిలో ధాన్యం రాశులపై కప్పిన బరకాలు

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

కె.గంగవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల మధ్యాహ్నం ఉన్నట్టుండి కురిసిన వర్షానికి వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మండలంలోని పలు ప్రాంతాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల రైతులు యంత్రాలతో వరికోతలు చేసి తేమ శాతం తగ్గించుకునేందుకు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోకుండా రక్షించుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యం రాసులపై బరకాలు కప్పి తగిన రక్షణ చర్యలు తీసుకున్నారు. వాతావరణంలో ఉన్నట్టుండి వస్తున్న మార్పులతో రైతులు కలవరం చెందుతున్నారు.

సోమేశ్వరాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలోనున్న సోమేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ, పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని నందీశ్వరుడు, నవగ్రహ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ తదితర పూజలు ఈనెల 11 నుంచి జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం వేద పండితుల మంత్రాల మధ్య నందీశ్వరుడు, నవగ్రహ విగ్రహాలు, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ జరిపారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, నిత్యోపాసన జరిపారు. పునఃప్రతిష్ఠ అనంతరం జయాది ప్రతిష్ఠ హోమాలు, మహా పూర్ణాహుతి తదితర పలు కార్యక్రమాలు జరిపారు. మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల ఆయా పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠలో నాయకుల పూజలు: వెల్ల సోమేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంపీపీ అంబటి భవానీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి పాల్గొని పూజలు చేశారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించొద్దు



ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 13(ఆంధ్ర జ్యోతి): టీటీడీ దేవస్థానం గోశాల వ్యవహారంలో టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఖండించారు. గతంలో తాను టీటీడీ బోర్డు సభ్యుడుగా ఉన్న సమయం లో 2016లో గోశాలకు వెళ్లగా అక్కడ ఆవుల దుస్థితిని చూసి చలించిన విషయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల గుర్తు చేశారు. స్వతహాగ క్రైస్తవుడైన కరుణాకరరెడ్డి మాటలను హిం దువులు నమ్మవద్దని కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ కరుణాకరరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ తప్పుపట్టారు. ఎక్కడో చనిపోయిన గోవులను ఇక్కడ చని పోయినట్టు చూపించి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఆయన వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల ధ్వజమెత్తారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన చేస్తున్నాం

కె.గంగవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నామని కె.గంగవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆదివారం గంగవరం, కోట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పితే ప్రభుత్వ రాయితీలపై వారు వివరించారు. రెండు గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న ఎనిమిది మంది విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించడానికి అంగీకార పత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పీవీ బ్రహ్మానందం, పి.శ్రీనివాసు, కె.శ్రీనివాసు, నందూరి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



పేరెంట్స్ నుంచి అంగీకారపత్రం తీసుకుంటున్న ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన

జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గం

మండపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వాకచర్ల వీవీ సత్యనారాయణ గుప్తా ఆదివారం నూతన కార్యవర్గంతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును కలిశారు. సంఘం ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించి వైశ్య సంఘానికి ఏ అవసరం వచ్చినా ముందుంటానని చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన వారిలో సంఘ ఉపాధ్యక్షుడు కంచర్ల ప్రసాద్, కోశాధికారి సుగ్గు ప్రసాద్, మద్దుల శ్రీను, వైశ్య యూత్ అధ్యక్షుడు నూలు మూర్తి, చెన్నా రాంబాబు, సంకా బాబ్జి, ఉద్దగిరి అంజ నేయులు, కాళ్లకూరి శ్రీను తదితరులు వున్నారు.



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన కార్యవర్గం

చిన్నారి తేజస్వినికి ఆర్థికసాయం

కె.గంగవరం, ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి): తల్లిదండ్రులు లేని చిన్నారికి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థికసాయం అందించి ఉదారత చాటుకున్నారు. పాతకోట గ్రామానికి చెందిన తేజస్విని భబూామవర్షిణికు తల్లిదండ్రు లు లేరు. అమ్మమ్మ, తాతయ్యలే పెంచి పోషిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి స్పందించి రూ. 20వేలు ఆర్థికసాయం చేశారు. చిన్నారిని బాగా చదివించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు తాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా

మండపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) మండపేట అదిత్య కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభినందించారు. కళాశాల విద్యార్థులతో కలిసి డైరెక్టర్ చిర్ల సుబ్బిరెడ్డి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేగుళ్లను క్యాంపు కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా ఇంటర్ సెకండ్ ఇయర్‌లో మండపేట అదిత్య కాలేజీ విద్యార్థిని నల్లమిల్లి సబిత, ఎంపీసీలో 992 మార్కులు సాధించి స్టేట్ ఫస్టు సాధించిందన్నారు. 990 మార్కులతో ఖండవిల్లి వీరసాయి అమృత స్టేట్ థర్డ్, బైపీసీలో 984 మార్కులతో పిచ్చుక మనోహర్, టౌన్ ఫస్ట్ 983 మార్కులతో మల్లిడి మణికంఠ రెడ్డి, టౌన్ సెకండ్ సాధించారన్నారు. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి మార్కులు సాధించారని డైరెక్టర్ చిర్ల జె.సుబ్బిరెడ్డి చెప్పారు. విజేతలైన విద్యార్థులను ఎమ్మెల్యే వేగుళ్ల అభినందించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ఉద్దే శించి అన్నారు. కార్యక్రమంలో అదిత్య కళాశాల సిబ్బందితోపాటు పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వున్నారు.

16న విజ్ఞాన్ కళాశాలలో జాబ్‌మేళా

మండపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండపేట ఆలమూరు రోడ్డులో వున్న విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో 16న గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారికి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ బాబి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు బయోడేటా తోపాటు రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మండపేట పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.



పెరిగిన నిమ్మకాయ ధరలతో ప్రజల విముఖత

ఆత్రేయపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్‌లో నిమ్మధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఉమ్మడి జిల్లాలో పూతరాలిపోవడంతో పాటు దిగుబడి లేకపోవడంతో పలువురు వ్యాపారులు పక్క జిల్లాలకు వెళ్లి వాటిని కొనుగోలు చేస్తున్నారు. చిత్తూరు, గూడూరు ప్రాంతాల్లో పండిన నిమ్మకాయలు ఇక్కడికి దిగుబడి చేసుకోవడంతో వాటి ధరలు పెరిగిపోయాయి. ప్రస్తుతం కిలో రూ.100 ధర పలుకుతుండగా, పెద్దకాయ ఒక్కొక్కటి రూ.6కి విక్రయిస్తున్నారు. పెరిగిన రేటుతో వినియోగదారులు వాటిని కొనలేక విముఖత వ్యక్తం చేస్తున్నారు.

నేడు గ్రామసభలు

రాయవరం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాయవరంలో ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో 29 అంశాల్లోని ప్రాధాన్యతాంశాలతో పాటు పలు అంశాలపై గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని వి.సావరం, లొల్ల, చెల్లూరు, కురకాళ్లపల్లి కూర్మాపురం, మాచవరం, రాయవరం, పసలపూడి, వెంటూరు, వెదురుపాక, నదురుబాద గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో వివిధ గ్రామాల వారికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి సుభాష్ ఆదివారం అందచేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన టి.గంగాభవానీ, నరసాపురపుపేటకు చెందిన డి. లక్ష్మీపతి, కె.గంగవరం మండలం కె.గంగవరంకు చెందిన ఎస్.రామకృష్ణ, కూళ్ల గ్రామానికి చెందిన తడాల అనంతలక్ష్మి, కాజులూరు మండలం శలపాకకు చెందిన నల్లమిల్లి వీరలక్ష్మిలకు మంజూరైన చెక్కులను మంత్రి సుభాష్ అందచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్‌కు నివాళులర్పించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అంబేడ్కర్‌కు నివాళి

కొత్తపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో గల అంబేడ్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.